క్లుప్తంగా

అమ్మవారికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలోని విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో హాజరైన భక్తులు లలితా పారాయణం నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

రాధేయపాలెంలో నేడు క్యాన్సర్ వైద్య శిబిరం

రాజానగరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మండలంలోని రాధేయపాలెంలో శనివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది. అలాగే కొత్త తుంగపాడులో జరిగే జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలో రాజా పాల్గొంటారు.

వైద్యశిబిరాలు

మధురపూడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరంగపట్నంలో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కోటికేశవరంలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: మండలంలోని సంపత్ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదు. ఆ సమయంలో పాత తుంగపాడు, సంపత్‌నగరాల్లోని వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు.


దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



వడిశలేరులో అమ్మవారు

రంగంపేట: గ్రామంలో ఉన్న విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా వడిశలేరు శివారు ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న కనకదుర్గ అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల గురించి వివరించారు. కామర్స్ అధ్యాపకుడు ఎస్కే మదీనా మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో ఉన్న వినియోగదారుల ఫోరమ్‌లను తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- రబీ సాగులో రైతుల బిజీ
- గ్రామాల్లో వరినాట్ల హడావుడి
- పనులను పరిశీలించిన ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్
- అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు



నరేంద్రపురంలో రైతులకు సూచనలిస్తున్న ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు

రాజానగరం: జిల్లాలోని రైతులు రబీ వరి సాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తి కావడంతో రబీ పనుతో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. చీడపీడలను అధిగమించి, అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవడంతోపాటు నారుమళ్లు వేయడం, పెరిగిన నారుతో నాట్లు పనులు ఊపందుకున్నాయి.

అనేక ప్రయోజనాలు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. సాగు పనులు ప్రారంభించినప్పటికీ నుంచి వీటిని చేపట్టాలి. తద్వారా పంటను చీడపీడలు, తెగుళ్లు ఆశించకపోవడంతో పాటు భూమికి సారం లభిస్తుంది. పంటలు ఏపుగా పెరుగుతాయి.

అధికంగా ఎరువులు వాడితే నష్టమే..

పంట ఏపుగా పెరగాలని, దిగుబడి ఎక్కువగా రావాలనే ఉద్దేశంతో కొందరు రైతులు తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను విపరీతంగా వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి బాగా పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. పరిమితికి మించిన ఎరువుల వాడకం వల్ల నష్టం కలుగుతుంది. పొలంలో భూసార పరీక్షలు చేయించి, ఆ నివేదికలో వెల్లడైన అంశాల ఆధారంగా ఎరువులు వాడాలి. తద్వారా భూమికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈ తరుణంలో దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు పలు ప్రాంతాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న వరినాట్ల విధానాన్ని గమనించారు. అలాగే రబీ వరి సాగులో రైతులు అనుసరించాల్సిన కొన్ని యాజమాన్య పద్ధతులను తెలియజేశారు.

విత్తన శుద్ధి

ఒక కిలో విత్తనానికి కార్బన్డిజమ్ 25 శాతం, మాంకోజెట్ 50 శాతం మిశ్రమ శిలీంద్ర నాసినిని రెండు గ్రాములు తీసుకుని నీటిలో కలిపి విత్తనాలకు పట్టించాలి. అదే పొడి విత్తనాలకు అయితే 4 గ్రాములు తీసుకోవాలి.

నారుమడి యాజమాన్యం

విత్తనాలు చల్లే ముందు 10 నుంచి 12 రోజులలో నారుమడి చేసే పొలాన్ని మూడు పర్యాయాలు దమ్ము చేసి, చదును చేయాలి. 5 సెంట్లలో వేసే నారుమడికి రెండు కిలోల నత్రజనిని (విత్తనం విత్తే ముందు ఒక కిలో, విత్తిన 10 – 14 రోజులలో మరో కిలో), ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. విత్తన శుద్ధి చేసి, మొలకకట్టిన విత్తనాలను సెంటు స్థలానికి 5 కిలోల చొప్పున చల్లాలి.

జింకు లోపాన్ని నివారించేందుకు..

జింకు లోపాన్ని గమనిస్తే రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇనుపధాతువు లోపం కూడా ఉన్నట్టు గమనిస్తే దాని నివారణకు ఒక లీటరు నీటికి 20 గ్రాముల అన్న బేధి, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలిచే పురుగులకు..

ప్రస్తుతం అక్కడక్కడా కాండం తొలిచే పురుగుల గుడ్ల సముదాయాలను గమనించామని, వాటి నివారణకు విత్తిన 10 రోజులకు కార్బొఫ్యూరాన్ 3 జి గుళికలు ఒక సెంటు భూమికి 160 గ్రాముల చొప్పున వేయాలని సూచించారు. లేకుంటే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరీఫాస్ 2.5 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి విత్తిన 10 – 17 రోజులకు పిచికారీ చేయాలన్నారు. నారు తీయడానికి వారం రోజుల ముందు ఒక సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బొఫ్యూరాన్ గుళికలను చల్లి, పలచగా నీరు పెట్టాలన్నారు. క్షేత్ర సందర్శనలో మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిం, అభ్యుదయ రైతులు ఈడ్పుగంటి నారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆ పనులు ఆపివేయాలని వినతి



విద్యుత్ శాఖ నిర్వహిస్తున్న పనులు

రాజానగరం: చక్రద్వారబంధంలో వైశ్యులకు సంబంధించిన శ్మశాన వాటికను ఆక్రమించి, విద్యుత్ శాఖ కరెంటు స్తంభాలను ఏర్పాటు చేస్తోందని ఆ గ్రామానికి చెందిన వైశ్యులు అన్నారు. సత్వరమే ఆ పనులను ఆపి వేసి, తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గాది వీర వెంకట సత్యనారాయణ, బలభద్ర బ్రహ్మాజీరావు, దవులూరి శ్రీనివాసరావు తదితరులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కాగా.. ఈ విషయమై స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఇంజినీర్ సుధాకర్‌ను వివరణ కోరగా.. పంచాయతీ తీర్మానం చేసి చూపిన స్థలంలోనే శాఖాపరంగా క్వాలిటీ విద్యుత్‌ని సరఫరా చేయడంలో భాగంగా పనులు జరుగుతున్నాయన్నారు.

చురుగ్గా ఇంటింటి సర్వే



ముగ్గళ్లలో సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ ఏసురాణి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ముగ్గళ్లలో వైద్య, ఆరోగ్య సిబ్బంది చేస్తున్న సర్వేను డాక్టర్ ఈ.ఏసురాణి పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి క్యాన్సర్ స్క్రీనింగ్, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, హిమోగ్లోబిన్ శాతం, బరువు, ఎత్తు, క్షయ, కుష్టుకు సంబంధించిన పరీక్షలు చేస్తున్నారన్నారు. ఏవైనా అనారోగ్య సమస్యలను గుర్తిస్తే తగిన వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎస్‌ఎం షహీదా బేగం, ఆశావర్కర్లు మరియమ్మ, మాధవి, సంధ్య పాల్గొన్నారు.

అందరూ సేవాగుణం అలవర్చుకోవాలి

ఏఎంసీ మాజీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



రామవరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలోని ఎస్సీ పేటలో కల్వరి మరనాత మినిస్ట్రీస్‌లో రెవరెండ్ కె.ఇజ్రాయేలు, పాస్టర్ జోషి రాజా ఆధ్వర్యంలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఇందులో కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత క్రిస్మస్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అలాగే కృష్ణారెడ్డి చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తమ ఆర్థిక పరిస్థితి మేరకు ఇతరులకు సేవ చేయడంలో సంతృప్తి ఉంటుందన్నారు. ఏసుక్రీస్తుకు సిలువ వేశాక ఆయన నోటి నుంచి వచ్చిన ఏడు మాటలను మానవుడు ఆచరిస్తే, మానవ జీవితం పరిపూర్ణమవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలక మండలి సభ్యురాలు లంక అవమ్మ, జుత్తిక సత్యవేణి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి దోహదం



దోమాడ సదస్సులో మాట్లాడుతున్న పద్మజారెడ్డి

పెదపూడి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మజారెడ్డి అన్నారు. మండలంలోని దోమాడ, పుట్టకొండ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజరెడ్డి మాట్లాడుతూ, రైతుల భూములకు సంబంధించి మార్పులు, భూములు కొలతల్లో తక్కువ, ఎక్కువ, ఆన్‌లైన్‌లో భూ సమస్యలపై రైతులు దరఖాస్తులు అందించి పరిష్కారం పొందాలన్నారు. ఆయా గ్రామాల్లో ఐదు దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో సర్పంచులు మీనవల్లి శారదదేవి, కుడిపూడి మాధవీలత, వీఆర్వోలు పి.నాగేశ్వరరావు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

బిక్కవోలు: గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జీపీడీపీ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులను బట్టి గ్రామాల అభివృద్ధికి ప్రణాకలు సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధి దిశగా సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జాన్ మిల్టన్, ఎంపీపీ కన్నారావు, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పివీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

పెదపూడి: అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్దే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల ఒకరోజు శిక్షణ తరగతులకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయడంలో ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఐదు పంచాయతీలకు మంజూరైన ఐదు ట్రాక్టర్లను ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కొరెడ్ల వెంకన్నబాబు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పుట్టా గంగాధర్‌చౌదరి పాల్గొన్నారు.

సమయపాలన కచ్చితంగా పాటించాలి



కాటవరం సదస్సులో పాల్గొన్న జేసీ చిన్న రాముడు



శ్రీరంగపట్నంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణ నాయక్

సీతానగరం: రెవెన్యూ సదస్సుల నిర్వహణలో సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కాటవరం, జాలిమూడి గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ సదస్సును శుక్రవారం కాటవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ సదస్సులో 14 అర్జీలను స్వీకరించామని, వాటిని 33 రోజుల్లో పరిష్కరించాల్సి ఉందన్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టాదారు పాస్‌బుక్‌ల కోసం ఏడు, పేర్లు తప్పుగా నమోదయ్యాయని రెండు, సర్వేకు రెండు, మరణ ధ్రువీకరణ పత్రం, అగ్రికల్చర్ ఇన్‌కమ్ సర్టిఫికెట్, ఓబీసీ సర్టిఫికెట్ కోసం ఒక్కొక్క అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ నవీన్, మండల సర్వేయర్ గౌతమ్, ఎండోమెంట్ ఈవో పాటి సత్యనారాయణ, వీఆర్వో గెద్దం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: రైతుల నుంచి వచ్చిన అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తు ప్రచారం నిర్వహించిన తర్వాతే సదస్సులు నిర్వహించాలన్నారు. డివిజన్‌లో ఇప్పటివరకూ 534 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ తహసీల్దార్ వి.సుస్వాగతం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

రంగంపేట: మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితురాలు నక్కా లక్ష్మి కుటుంబానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఆర్థికసాయం అందించారు. స్థానిక నాయకులు సమకూర్చిన రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు. విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని, ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు., రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు చెప్పారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

సీతానగరం: అనుమతి లేని ముగ్గళ్ల ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సొసైటీ భూమి రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ భూమిలో ముగ్గళ్లకు చెందిన ట్రాక్టర్లు మాత్రమే ఇసుక తవ్వకాలు జరుపుకోవాలని, కానీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నాయన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు ర్యాంపు వద్దకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ముగ్గళ్ల ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. ఇసుక అవసరమైన వారు ప్రభుత్వం అనుమతి పొందిన వంగలపూడి ర్యాంపు నుంచి తీసుకువెళ్లవచ్చని తెలిపారు.

మోటారు సైకిళ్ల చోరీలపై కేసులు

సీతానగరం: మోటారు సైకిళ్ల చోరీలపై యజమానుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసులు నమోదు చేశారు. మిర్తిపాడుకు చెందిన వినాయకరావు మోటారు సైకిల్ మూడు నెలల క్రితం పోయింది, అలాగే బొబ్బిల్లంకకు చెందిన రాజు బైక్ అక్టోబర్‌లో మాయమైంది. దీనిపై వీరిద్దరూ విడివిడిగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసులు నమోదు చేశారు. ఉండేశ్వరపురానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్ మోటారు సైకిల్ ఈ నెల 9వ తేదీన అదృశ్యమైంది. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

టీఎల్ఎంతో మెరుగైన విద్యాబోధన



మేళాలను పరిశీలిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ సెంటర్ అబ్జర్వర్ రంగయ్య తదితరులు

రాజానగరం: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వినూత్న విద్యాబోధన చేయవచ్చని ఎస్ఈఆర్‌టీ సైకాలజిస్టు కో ఆర్డినేటర్ ఆర్.రంగయ్య అన్నారు. కొండగుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఐదో బ్యాచ్ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం, టీఎల్ఎం మేళాలను పరిశీలించి, వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకాస్ట్, నో కాస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి అబ్బురపరచేలా బోధనోపకరణాలు తయారు చేయవచ్చని నిరూపించారన్నారు. సెంటర్ కో ఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ తెలుగు, గణితం, ఇంగ్లిషు సబ్జెక్టులలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సులువుగా బోధన చేసేలా టీఎల్ఎంలను తయారు చేసి ప్రదర్శించారన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రతి పాఠశాలలోనూ ఎస్ఆర్ఎం మేళాను ఉపాధ్యాయులు నిర్వహిస్తారన్నారు.

ఆకట్టుకున్న మేళాలు

శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం, టీఎల్ఎం మేళాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ డి.సుజాతారత్నం, కేఆర్‌పీలు ఎం.గంగాధరరావు, ఎం.రాంబాబు, ఎంఈఓలు కె.తిరుమలరావు, చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో సమస్యల పరిష్కారం

రాజానగరం: ప్రాంతాల వారీగా సమస్యలను గుర్తించి, వినూత్న ఆలోచనలతో వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని భువనేశ్వర్‌కు చెందిన కేఐఐటీ పరిశోధన అభివృద్ధి, ఆవిష్కరణల డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ సూర్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణలకు, ఇన్నోవేషన్లకు నిధులు ప్రధానం కాదని, భిన్నంగా ఆలోచించడమే ముఖ్యమన్నారు. వ్యవసాయ విభాగంలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందడుగు వేస్తే మంచి ఫలితాలను అందుకోవచ్చన్నారు. ఇతర రంగాలలో మాదిరిగానే వ్యవసాయ రంగంలోనూ స్టార్టప్‌లకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు. ఆర్ఐటీ డైరెక్టర్ డాక్టర్ పీవీ కడోలి మాట్లాడుతూ సాంకేతిక పరిశోధనలలో పరస్పర విజ్ఞాన మార్పిడి కార్యక్రమాలను జీజీయూతో కలిసి నిర్వహిస్తామన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ సేవలను యూనివర్సిటీ ద్వారా అందిస్తామన్నారు. విద్యార్థులు గ్రామాలను దత్తత తీసుకుని రైతులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొచాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కేకే హెర్బల్ సంస్థల మేనేజర్ కేర్ కదం, సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషమాధవ్, జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మృత్యుంజయ సూర్‌ను సత్కరిస్తున్న జీజీయూ చాన్సలర్ చైతన్య రాజు